# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

1 దేవుని చిత్తాన్ని బట్టి క్రీస్తు యేసు అపొస్తలుడైన పౌలు,
ఎఫెసులో ఉన్న క్రీస్తు యేసునందు నమ్మకస్థులైన, దేవుని
పరిశుద్ధ ప్రజలకు వ్రాయునది:
2 మన తండ్రియైన దేవుని నుండి, ప్రభువైన యేసు క్రీస్తు నుండి
కృపా సమాధానాలు మీకు కలుగును గాక.

## క్రీస్తులో ఉన్న ఆత్మీయ ఆశీర్వాదాలను బట్టి స్తుతించుట

3 మన ప్రభువైన యేసు క్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడును
గాక. పరలోక మండలాల్లో, ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదంతో
క్రీస్తులో ఆయన మనల్ని దీవించారు.
4 మనం ఆయన దృష్టిలో పరిశుద్ధంగా నిర్దోషంగా ఉండాలని లోకం
సృష్టించబడక ముందే ఆయన క్రీస్తులో మనల్ని ఏర్పరచుకున్నారు.
5 తన ప్రేమతో ముందుగానే, యేసు క్రీస్తు ద్వారా మనల్ని తన
సొంత కుమారులుగా స్వీకరించాలని ఆయన నిర్ణయించుకోవడం
ఆయనకు ఎంతో ఇష్టాన్ని ఆనందాన్ని కలిగించింది.
6 తాను ప్రేమించిన వానిలో, ఆయన మనకు ఉచితంగా
అనుగ్రహించిన తన మహాకృపకు ఘనత కలుగునట్లు దేవుడు
ఈ విధంగా చేశారు.
7 దేవుని కృపా ఐశ్వర్యానికి అనుగుణంగా ఆయనలో మనం
ఆయన రక్తం ద్వారా విడుదల, పాపక్షమాపణ కలిగి ఉన్నాము.
8 ఆ కృపను ఎంత ధారాళంగా కుమ్మరించారంటే, దానితో మనకు
సంపూర్ణమైన జ్ఞానం, వివేచనను ఇచ్చి,
9 క్రీస్తులో ఆయన ఉద్దేశించిన తన చిత్తాన్ని గురించిన మర్మాన్ని
తన దయాసంకల్పానికి అనుగుణంగా మనకు తెలియజేశారు.

10 కాలం సంపూర్ణమైనప్పుడు తన చిత్తాన్ని నెరవేర్చడానికి, అనగా
పరలోకంలో ఉన్న వాటినే గాని భూమి మీద ఉన్న వాటినే గాని
సమస్తాన్ని క్రీస్తులో ఏకంగా సమకూర్చాలని నిర్ణయించుకొన్నారు.
11 దేవుడు తన చిత్తప్రకారమైన సంకల్పాన్ని బట్టి, క్రీస్తులో
ముందుగా నిరీక్షించిన మనం, తన మహిమకు కీర్తి తీసుకురావాలని
నిర్ణయించి, ఆయన మనల్ని తన వారసులుగా ఏర్పరచుకున్నారు.
12 ఆయన తన చిత్తానుసారంగా చేసిన నిర్ణయాన్ని బట్టి, సమస్త
కార్యాలను జరిగిస్తున్నారు.
13 మీరు కూడా సత్య వాక్యాన్ని అనగా మీ రక్షణ సువార్తను
విని, క్రీస్తులో విశ్వాసం ఉంచినప్పుడు వాగ్దానం చేయబడిన
పరిశుద్ధాత్మచేత ముద్రించబడి ఉన్నారు.
14 దేవుని మహిమను స్తుతించడానికి ఆయన స్వాస్థ్యమైన వారికి
విడుదల కలిగే వరకు ఈ ఆత్మ మన వారసత్వానికి హామీగా ఉన్నాడు.

## ప్రార్థన కృతజ్ఞత చెల్లించుట

15 ఈ కారణాన్ని బట్టి, ప్రభువైన యేసులో మీ విశ్వాసం గురించి,
దేవుని ప్రజలందరి పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ గురించి నేను
విన్నప్పటి నుండి,
16 మీ గురించి మానక దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తూ మీ కోసం
ప్రార్థిస్తున్నాను.
17 మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క దేవుడైన మహిమా
స్వరూపియైన తండ్రిని మీరు తెలుసుకోవడానికి జ్ఞానం ప్రత్యక్షతగల
ఆత్మను మీకు ఇవ్వాలని నా ప్రార్థనలలో మిమ్మల్ని జ్ఞాపకం
చేసుకుంటున్నాను.
18-19 మిమ్మల్ని పిలిచిన పిలుపు యొక్క నిరీక్షణలో, ఆయన
పరిశుద్ధ ప్రజల్లో ఆయన వారసత్వం యొక్క మహిమైశ్వర్యం
ఎలాంటిదో, మనం నమ్మిన ఆయన శక్తి యొక్క అపరిమితమైన

ప్రభావం ఎంత గొప్పదో మీరు తెలుసుకోవడానికి మీ మనోనేత్రాలు
వెలిగించబడాలని ప్రార్థిస్తున్నాను.
20-21 ఆయన ప్రభావవంతమైన శక్తితోనే క్రీస్తును మృతులలో
నుండి లేపి, సమస్త ఆధిపత్యం కంటే, అధికారం కంటే, శక్తి కంటే,
ప్రభుత్వం కంటే, ఈ యుగంలోను రాబోవు యుగాల్లోను పేరుగాంచిన
ప్రతి నామం కంటే ఎంతో హెచ్చుగా పరలోకంలో తన కుడి వైపున
ఆయనను కూర్చోబెట్టుకున్నారు.
22 దేవుడు సమస్తాన్ని క్రీస్తు పాదాల క్రింద ఉంచి, సమస్తానికి పైన
సంఘానికి ఆయనను శిరస్సుగా నియమించారు.
23 సంఘం అనగా ఆయన శరీరం; సమస్తాన్ని పూర్తిగా నింపుతున్న
ఆయన యొక్క పరిపూర్ణత.

# 2

## క్రీస్తులో సజీవం

1 మీరైతే, మీ అతిక్రమాలలో పాపాల్లో చచ్చినవారిగా ఉండి,
2 మీరు వీటిలో జీవిస్తున్నప్పుడు ఈ లోక మార్గాలను,
అవిధేయులైన వారిలో ఇప్పుడు పని చేస్తున్న ఆత్మయైన
వాయుమండల అధిపతిని అనుసరించేవారు.
3 మనమందరం కూడా ఒకప్పుడు లోకస్థులతో కలిసి జీవిస్తూ
శరీరేచ్ఛలను మనస్సులోని కోరికలను నెరవేర్చుకొంటూ, ఇతరుల్లా
మన శరీరాశలను అనుసరించి ప్రవర్తిస్తూ దేవుని ఉగ్రతకు పాత్రులంగా
ఉండేవారము.
4 అయినప్పటికీ, దేవుడు తన మహా ప్రేమను బట్టి, ఆయన
కరుణాసంపన్నతను బట్టి
5 మనం మన అతిక్రమాలలో పాపాల్లో చచ్చినవారిగా ఉండగా,
క్రీస్తుతో పాటు మనల్ని బ్రతికించారు. ఆయన కృప చేత మీరు
రక్షించబడ్డారు.

6 దేవుడు క్రీస్తుతో పాటు మనల్ని కూడా లేపి, పరలోకం మండలాల్లో
క్రీస్తు యేసుతో పాటు కూర్చోబెట్టారు.
7 రాబోయే యుగాలలో ఆయన తన కృప యొక్క సాటిలేని
ఐశ్వర్యాన్ని చూపించటానికి, క్రీస్తు యేసునందు మన పట్ల ఆయన
దయలో వ్యక్తపరిచారు.
8 మీరు మీ విశ్వాసం ద్వారా కృపను చేత రక్షించబడి ఉన్నారు.
ఇది మీ నుండి వచ్చింది కాదు, గాని ఇది దేవుడు మీకిచ్చిన
బహుమానము.
9 అది క్రియల వలన కాదు, కాబట్టి ఎవరు గొప్పలు చెప్పుకోలేరు.
10 ఎందుకంటే దేవుడు మన కోసం ముందుగా సిద్ధపరచిన మంచి
క్రియలు చేయడానికి క్రీస్తు యేసునందు సృష్టింపబడిన మనం దేవుని
చేతిపనియై ఉన్నాము.

## క్రీస్తు ద్వారా యూదులు, యూదేతరులు సమాధానపరచబడుట

11 కాబట్టి, పుట్టుకతోనే యూదేతరులైన మీరు, తమను తాము
"సున్నతి" అంటే మానవ హస్తాలతో శరీరంలో చేయబడేది అని
పిలుచుకునే వారి చేత "సున్నతి చేయబడనివారు" అని గతంలో
ఎలా పిలువబడ్డారో జ్ఞాపకం చేసుకోండి.
12 ఆ సమయంలో మీరు క్రీస్తు నుండి వేరుగా ఉన్నారు,
ఇశ్రాయేలులో పౌరసత్వం లేనివారిగా, వాగ్దాన నిబంధనలకు
విదేశీయులుగా, నిరీక్షణ లేనివారిగా, లోకంలో దేవుడు లేనివారిగా
ఉండేవారు.
13 ఒకప్పుడు దూరంగా ఉన్న మీరు ఇప్పుడు క్రీస్తు యేసు రక్తాన్ని
బట్టి దేవునికి దగ్గరయ్యారు.
14 రెండు సమూహాలను ఒకటిగా చేసి, శత్రుత్వం యొక్క అడ్డు
గోడను నాశనం చేసిన ఆయనే మన సమాధానం.
15 అంటే, యేసు క్రీస్తు తన శరీరంలో మోషే ఇచ్చిన ధర్మశాస్త్రంలోని
ఆజ్ఞలను నియమాలను కొట్టివేసారు. ఈ ఇద్దరిని కలిపి తనలో ఒక

నూతన మానవున్ని సృజించి ఆ విధంగా సమాధానపరచడం ఆయన
ఉద్దేశము.
16 ఈ ఇరువురిని తన సిలువ ద్వారా ఏక శరీరులుగా దేవునితో
సమాధానపరచి, వారి మధ్య ఉన్న శత్రుత్వాన్ని చంపేశారు.
17 ఆయన వచ్చి, దూరంగా ఉన్న మీకు, దగ్గరగా ఉన్నవారికి
సమాధాన సువార్తను ప్రకటించారు.
18 ఆయన ద్వారానే మనం ఇద్దరం ఒక్క ఆత్మలో తండ్రి సన్నిధికి
చేరగలుగుతున్నాము.
19 దీన్ని బట్టి మీరు ఇకమీదట పరాయి వారు లేదా విదేశీయులు
కారు, దేవుని ప్రజలతో తోటి పౌరులుగా ఆయన కుటుంబ సభ్యులుగా
ఉన్నారు.
20 క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయిగా అపొస్తలులు, ప్రవక్తలు
వేసిన పునాది మీద మీరు కట్టబడియున్నారు.
21 ఆ కట్టడమంతా ఆయనలో ఒకటిగా అమర్చబడి ప్రభువులో
పరిశుద్ధాలయంగా వృద్ధిపొందుతూ ఉంది.
22 ఈ విధంగా ఆయనలో మీరు కూడా ఆత్మ మూలంగా దేవునికి
నివాసస్థలంగా కట్టబడుతున్నారు.

# 3

## యూదేతరుల పట్ల దేవుని అద్భుత ప్రణాళిక

1 ఈ కారణంచేత, యూదేతరులైన మీరు రక్షింపబడాలని, పౌలు
అనే నేను క్రీస్తు యేసు సువార్త విషయంలో ఖైదీనై ఉన్నాను.
2 మీ కోసం నాకు అనుగ్రహించబడిన దేవుని కృపా ఏర్పాటును
గురించి మీరు నిశ్చయంగా విన్నారు.
3 అదేమిటంటే, ఇంతకుముందే మీకు క్లుప్తంగా వ్రాసినట్లు, క్రీస్తు
గురించిన మర్మం నాకు ప్రత్యక్షపరచబడింది.
4 మీరు దానిని చదివినట్లైతే ఆ క్రీస్తు మర్మాన్ని గురించి నాకున్న
పరిజ్ఞానాన్ని మీరు తెలుసుకోగలరు.

5 ఈ మర్మం, ఆత్మ వలన ఇప్పుడు దేవుని పరిశుద్ధ అపొస్తలులకు
ప్రవక్తలకు తెలియపరచబడినట్లుగా ఇతర తరాలలోని వారికి
తెలియపరచబడలేదు.
6 ఈ రహస్యం ఏంటంటే, సువార్త ద్వారా యూదేతరులు
ఇశ్రాయేలుతో కలిసి వారసులు, ఒకే శరీరంలోని సభ్యులు, క్రీస్తు
యేసులోని వాగ్దానంలో భాగస్వాములు.

7 దేవుడు తన శక్తినిబట్టి నాకు అనుగ్రహించిన కృపావరం చొప్పున
నేను ఆ సువార్తకు సేవకుడినయ్యాను.

8 పరిశుద్ధులలో నేను అత్యంత అల్పున్ని కానీ లెక్కించలేని
ఆశీర్వాదాలు క్రీస్తు యేసులో ఉన్నాయని యూదేతరులకు
ప్రకటించడానికి దేవుడు తన దయతో నన్ను ఏర్పరచుకున్నారు.
9 సమస్తాన్ని సృజించిన దేవుడు అనాది నుండి దాచబడి ఉన్న
ఆ మర్మాన్ని, ప్రజలందరికి తెలియజేయడానికి ఆ కృపను నాకు
అనుగ్రహించారు.
10 దేవుని ఉద్దేశమేమిటంటే, సంఘం ద్వారా, దేవుని నానా
విధాలైన జ్ఞానము వాయుమండలంలోని ప్రధానులకు అధికారులకు
తెలియజేయబడాలి.
11 అందుకని దేవుడు తన నిత్య సంకల్పాన్ని మన ప్రభువైన యేసు
క్రీస్తు ద్వారా నెరవేర్చారు.
12 ఈ విధంగా ఇప్పుడు ఆయనలో ఉంచిన విశ్వాసం ద్వారా
స్వేచ్ఛగా ధైర్యంగా దేవుని సమీపించగలము.
13 కాబట్టి నేను చెప్పేది ఏంటంటే, మీ గురించి నేను పడిన
శ్రమలను బట్టి మీరు నిరుత్సాహపడవద్దు, అవి మీకు కీర్తి.

## ఎఫెసీయుల కోసం ప్రార్థన

14 ఈ కారణాన్ని బట్టి, తండ్రి ఎదుట నేను మోకరిస్తున్నాను,
15 పరలోకంలోను భూమి మీద ఉన్న ప్రతి కుటుంబం ఆయనను
బట్టే కుటుంబమని పిలువబడుతుంది.

16 తన మహిమ సమృద్ధి నుండి ఆయన మిమ్మల్ని మీ
అంతరంగంలో తన ఆత్మ ద్వారా శక్తితో బలపరచాలని,
17 అప్పుడు విశ్వాసం ద్వారా మీ హృదయాల్లో క్రీస్తు నివసించాలని
నేను ప్రార్థిస్తున్నాను. మీరు ప్రేమలో వేరుపారి స్థిరపడాలని,
18 మీరు ప్రభువు యొక్క పరిశుద్ధ ప్రజలందరితో కలిసి శక్తిని పొంది,
క్రీస్తు ప్రేమ ఎంత వెడల్పు, పొడుగు, లోతు, ఎత్తు ఉన్నదో గ్రహిస్తూ,
19 సమస్త జ్ఞానానికి మించిన క్రీస్తు ప్రేమను తెలుసుకుంటూ దేవుని
పరిపూర్ణతతో మీరు పూర్తిగా నింపబడాలని నేను ప్రార్థిస్తున్నాను.
20 మనలో పని చేసే తన శక్తినిబట్టి మనం అడిగే వాటికంటే,
ఊహించే వాటికంటే కొలవలేనంత అత్యధికంగా చేయడానికి శక్తిగల
దేవునికి,
21 సంఘంలోనూ క్రీస్తు యేసులోనూ తరతరములు మహిమ
నిరంతరం కలుగును గాక ఆమేన్.

# 4

## క్రీస్తు శరీరంలో ఐక్యత పరిపూర్ణత

1 మీరు పిలువబడిన పిలుపుకు యోగ్యులుగా నడుచుకోవాలని
ప్రభువు యొక్క ఖైదీనైన నేను మిమ్మల్ని కోరుతున్నాను.
2 ప్రేమలో ఒకరిని ఒకరు సహించుకుంటూ పూర్ణ వినయంతో
సాత్వికంతో, దీర్ఘశాంతంతో ఉండండి.
3 మీరు సమాధాన బంధం చేత ఆత్మ కలిగించే ఐక్యతను
కాపాడుకోడానికి ప్రయాసపడండి.
4 శరీరం ఒక్కటే; ఆత్మ ఒక్కటే, ఆ ప్రకారమే మీరు
పిలువబడినప్పుడు ఒకే నిరీక్షణ కోసం పిలువబడ్డారు;
5 ప్రభువు ఒక్కడే, విశ్వాసం ఒక్కటే, బాప్తిస్మం ఒక్కటే;
6 అందరికి తండ్రియైన దేవుడు ఒక్కరే, ఆయనే అందరికి పైగా
ఉన్నవారు, అందరి ద్వారా వ్యాపించి అందరిలో ఉన్నారు.

7 అయితే అందరికి క్రీస్తు నిర్ణయించిన పరిమాణం చొప్పున కృప
ఇవ్వబడింది.
8 అందుకే, ఈ విధంగా చెప్పబడింది:
"ఆయన ఆరోహణమైనప్పుడు,
ఆయన అనేకమందిని చెరపట్టి తీసుకెళ్లి,
తన ప్రజలకు బహుమానాలను అనుగ్రహించారు."*
9 ఆయన ఆరోహణం అయ్యారంటే ఆయన క్రిందకు, భూమి మీదకు†
దిగివచ్చారని దాని అర్థం కాదా?
10 క్రిందకు దిగివచ్చినవాడే, సమస్త ప్రపంచాన్ని నింపడానికి ఆకాశ
మండలాలన్నింటి కంటే పైగా ఆరోహణమయ్యారు.
11-13 మనం విశ్వాసంలో దేవుని కుమారుని గురించిన జ్ఞాన
విషయంలో ఐక్యతను పొందేవరకు, క్రీస్తు యొక్క పరిపూర్ణతకు
సమానమైన పరిపూర్ణత గల వారం అయ్యేవరకు క్రీస్తు శరీరమైన
సంఘం కట్టబడేలా తన ప్రజలను పరిచర్య కోసం సిద్ధపరచడానికి, క్రీస్తే
అపొస్తలులను, ప్రవక్తలను, సువార్తికులను, కాపరులను, బోధకులను
అనుగ్రహించారు.
14 మనం ఇంకా పసిపిల్లలం కాదు కాబట్టి, మనుష్యులు
మోసపూరిత యోచనలతో వంచనలతో కుయుక్తితో చేసే బోధలు
అనే ప్రతీ గాలికి ఇటు అటు ఎగిరిపోతూ, అలలచే ముందుకు
వెనుకకు కొట్టుకొనిపోయేవారంగా ఉండకూడదు.
15 ప్రేమ కలిగి సత్యం మాట్లాడుతూ క్రీస్తును శిరస్సుగా
కలిగిన పరిపూర్ణ శరీరంలా ఉండడానికి మనం అన్ని విషయాల్లో
ఎదుగుదాము.
16 ఆయన సర్వశరీరం చక్కగా అమర్చబడి తనలో ఉన్న ప్రతీ
అవయవం దాని పనిని చేస్తుండగా, ప్రతి కీలు సహాయంతో ఒకటిగా
అతుకబడి ప్రేమలో తనకు అభివృద్ధి కలుగునట్లు శరీరాన్ని వృద్ధి
చేసుకుంటుంది.

* **4:8** కీర్తన 68:18 † **4:9** లేదా భూమి క్రింది అంచుల వరకు

## వెలుగు సంబంధమైన పిల్లలుగా జీవించుట

17 కాబట్టి మీరు, ఇకమీదట దేవుని భయంలేని యూదేతరులు
నడుచుకొనునట్లు వ్యర్థమైన ఆలోచనలతో నడుచుకొనకూడదని
ప్రభువు ఇచ్చిన అధికారంతో మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను.
18 వారు తమ హృదయ కాఠిన్యాన్ని బట్టి తమలో ఉన్న అజ్ఞానం
కారణంగా దేవుని నుండి వచ్చే జీవం నుండి వేరుపరచబడి
గ్రహించుటలో గ్రుడ్డివారిగా ఉన్నారు.
19 వారు సిగ్గును వదిలి అత్యాశతో నానా విధాలైన
అపవిత్ర కార్యాలను జరిగిస్తూ, తమను తామే కాముకత్వానికి
అప్పగించుకున్నారు.
20-21 అయితే మీరు క్రీస్తు గురించి విన్నప్పుడు యేసులో ఉన్న
సత్యానికి అనుగుణంగా ఆయనలో బోధించబడినప్పుడు మీరు
నేర్చుకున్న జీవన విధానం ఇది కాదు.
22 మీ పాత స్వభావాన్ని, మీకు బోధించబడిన ప్రకారం, మీ
ఆలోచనా వైఖరి నూతనపరచబడటానికి,
23 మీ మోసపూరిత కోరికలతో చెడిపోతున్న, మీ పాత స్వభావాన్ని
విడిచిపెట్టాలి;
24 నిజమైన నీతి, పరిశుద్ధత గల దేవుని పోలికగా ఉండడానికి
సృజించబడిన క్రొత్త స్వభావాన్ని ధరించుకోవాలి.
25 కాబట్టి మీలో ప్రతి ఒక్కరు తమ పొరుగువారితో అబద్ధమాడడం
మాని సత్యమే మాట్లాడాలి. ఎందుకంటే, మనమందరం ఒకే
శరీరంలోని అవయవాలమై ఉన్నాము.
26 "మీ కోపంలో పాపం చేయకండి"‡: సూర్యుడు అస్తమించే
వరకు మీరు ఇంకా కోపంతో ఉండకండి.
27 అలాగే అపవాదికి అడుగుపెట్టే అవకాశం ఇవ్వకండి.
28 దొంగతనం చేసేవారు ఇకమీదట దొంగతనం చేయకూడదు, కానీ
తమ చేతులతో అవసరమైన మంచి పనులను చేస్తూ, కష్టపడుతూ

‡ **4:26** కీర్తన 4:4

అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలి.
29 మీ నోటి నుండి ఏ చెడు మాటలు రానివ్వకండి, వినేవారికి మేలు
కలిగేలా అవసరాన్ని బట్టి, ముందు వారు బలపడడానికి సహాయపడే
మంచి మాటలే మాట్లాడండి.
30 విమోచన దినం కోసం మీరు ఎవరితో ముద్రించబడ్డారో ఆ దేవుని
పరిశుద్ధాత్మను మీరు దుఃఖపరచకండి.
31 అదే విధంగా, ద్వేషమంతటిని, కోపాన్ని, క్రోధాన్ని, అల్లరిని,
దూషణను, ప్రతి విధమైన దుష్టత్వాన్ని పూర్తిగా విడిచిపెట్టండి.
32 క్రీస్తులో దేవుడు మిమ్మల్ని క్షమించిన ప్రకారం మీరు కూడా
ఒకరిని ఒకరు క్షమిస్తూ, ఒకరిపట్ల ఒకరు దయా, కనికరం కలిగి
ఉండండి.

# 5

1 కాబట్టి మీరు దేవుని ప్రియ పిల్లల్లా ఆయనను పోలి నడుచుకోండి.
2 క్రీస్తు మనల్ని ప్రేమించి, పరిమళ సువాసనగా మన కోసం తనను
తాను దేవునికి అర్పణగా బలిగా అర్పించుకొన్నట్టే మీరు కూడా ప్రేమ
కలిగి నడుచుకోండి.
3 లైంగిక అపవిత్రత గాని లేదా ఇతర అపవిత్రత గాని అత్యాశ గాని
మీ మధ్యలో ఎంత మాత్రం ఉండకూడదు, ఎందుకంటే ఇవి దేవుని
పరిశుద్ధ ప్రజలకు తగినవి కావు.
4 దేవుని పట్ల కృతజ్ఞతగల మాటలనే మాట్లాడండి, మీలో బూతు
మాటలకు, మూర్ఖపు లేదా పోకిరి మాటలకు చోటు ఉండకూడదు.
5 వ్యభిచారులు, అపవిత్రులు, అత్యాశపడేవారు అందరు
విగ్రహారాధికులే; దేవునికి క్రీస్తుకు చెందిన రాజ్యంలో వారికి వారసత్వం
లేదని మీకు ఖచ్చితంగా తెలుసు.
6 వ్యర్థమైన మాటలతో ఎవరు మిమ్మల్ని మోసపరచకుండా
చూసుకోండి, ఎందుకంటే వీటిని బట్టి అవిధేయులైనవారి మీదికి
దేవుని ఉగ్రత వస్తుంది.
7 కాబట్టి అలాంటి వారితో మీరు భాగస్వాములుగా ఉండకండి.

8 ఒకప్పుడు మీరు చీకటియై ఉన్నారు, కానీ ఇప్పుడు ప్రభువులో
మీరు వెలుగై ఉన్నారు. కాబట్టి వెలుగు బిడ్డలుగా జీవించండి,
9 ఎందుకంటే వెలుగు ఫలం సమస్త మంచితనాన్ని, నీతిని,
సత్యాన్ని కలిగి ఉంటుంది.
10 కాబట్టి ప్రభువుకు ఇష్టమైనది ఏదో తెలుసుకోండి.
11 నిష్ఫలమైన చీకటి క్రియలలో పాల్గొనకుండా వాటిని
బట్టబయలు చేయండి.
12 అవిధేయులు రహస్యంగా చేసిన వాటిని గురించి మాట్లాడడం
కూడా అవమానమే.
13 కాని వెలుగుచేత చూపించబడే ప్రతిదీ స్పష్టంగా ఉంటుంది,
ప్రకాశించే ప్రతిదీ వెలుగు అవుతుంది.
14 అందుకే వాక్యంలో,
"నిద్రిస్తున్నవాడా, మేల్కో,
మృతులలో నుండి లే,
క్రీస్తు నీ మీద ప్రకాశిస్తారు"
అని వ్రాయబడింది.
15 చాలా జాగ్రత్తగా ఉండండి, అజ్ఞానుల్లా కాకుండా జ్ఞానుల్లా
జీవించండి.
16 దినాలు చెడ్డవి కాబట్టి ప్రతి అవకాశాన్ని సద్వినియోగం
చేసుకోండి.
17 కాబట్టి మీరు అవివేకులుగా ఉండకండి, అయితే ప్రభువు
చిత్తమేమిటో గ్రహించుకోండి.
18 మద్యంతో మత్తులు కాకండి, అది మిమ్మల్ని దుష్టత్వంలోనికి
నడిపిస్తుంది. అయితే ఆత్మ పూర్ణులై ఉండండి,
19 సంగీతములతో, కీర్తనలతో ఆత్మ సంబంధమైన పాటలతో,
ఒకరితో ఒకరు మాట్లాడుకోండి. మీ హృదయాలతో పాటలు పాడుతూ
సంగీతంతో ప్రభువును గురించి కీర్తిస్తూ,
20 ఎల్లప్పుడు మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట మన తండ్రియైన
దేవునికి అన్నిటి కోసం కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ ఉండండి.

## క్రైస్తవ కుటుంబాలకు సూచనలు

21 క్రీస్తుపట్ల గల భయభక్తులతో ఒకరికి ఒకరు లోబడి ఉండండి.
22 భార్యలారా, ప్రభువుకు లోబడి ఉన్నట్టే మీ సొంత భర్తలకు
లోబడి ఉండండి.
23 క్రీస్తు సంఘానికి శిరస్సై ఉన్నట్టుగా భర్త భార్యకు శిరస్సై
ఉన్నాడు. ఆయన శిరస్సుగా తన శరీరానికి రక్షకుడై ఉన్నారు.
24 సంఘం క్రీస్తుకు లోబడినట్టుగా భార్యలు కూడా ప్రతి విషయంలో
తమ భర్తలకు లోబడాలి.
25 క్రీస్తు కూడా సంఘాన్ని ప్రేమించి దాని కోసం తనను తాను
అప్పగించుకున్నట్టుగా, భర్తలారా మీ భార్యలను ప్రేమించండి.
26 క్రీస్తు ప్రేమ తన సంఘాన్ని వాక్యమనే నీళ్ల స్నానంతో శుద్ధి చేసి,
పవిత్రపరచడానికి,
27 దాన్ని కళంకంగానీ, మడతలుగానీ అలాంటిది మరేది
లేకుండా పరిశుద్ధంగా, నిర్దోషంగా మహిమ కలదిగా తన ముందు
నిలబెట్టుకోవాలని, దాని కోసం తనను తాను సమర్పించుకున్నారు.
28 అదే విధంగా భర్తలు తమ సొంత శరీరాన్ని ప్రేమించినట్లే తమ
భార్యలను ప్రేమించాలి. తన భార్యను ప్రేమించేవాడు తనను తాను
ప్రేమించుకుంటున్నాడు.
29 ఎవరూ కూడా తన సొంత శరీరాన్ని ద్వేషించరు, ప్రతివారు
దానిని పోషించి, కాపాడుకుంటారు, అదే విధంగా క్రీస్తు సంఘాన్ని
పోషించి కాపాడుతున్నారు.
30 ఎందుకంటే మనం ఆయన శరీరం యొక్క అవయవాలమై
ఉన్నాము.
31 "ఈ కారణంచేత పురుషుడు తన తల్లిదండ్రులను విడిచి తన
భార్యను హత్తుకుంటాడు. వారిద్దరు ఏకశరీరం అవుతారు."*
32 ఇది లోతైన మర్మం; అయితే నేను క్రీస్తు సంఘం గురించి
చెప్తున్నాను.

---

* **5:31** ఆది 2:24

33 చివరిగా నేను చెప్పేది ఏంటంటే, మీలో ప్రతీ పురుషుడు తనను
తాను ప్రేమించుకొన్నట్లు తన భార్యను ప్రేమించాలి, అలాగే భార్య తన
భర్తను గౌరవించాలి.

# 6

1 పిల్లలారా, ప్రభువులో మీ తల్లిదండ్రులకు విధేయులై ఉండండి,
అది సరియైనది.
2 "మీ తండ్రిని తల్లిని గౌరవించాలి, ఇది వాగ్దానంతో కూడిన
మొదటి ఆజ్ఞ.
3 దాని వలన మీకు మేలు కలుగుతుంది, మీరు సంతోషంగా భూమి
మీద దీర్ఘాయువు కలిగి జీవిస్తారు."*
4 తండ్రులారా,† మీ పిల్లలకు కోపం రేపకుండా ప్రభువు బోధలో
క్రమశిక్షణలో వారిని పెంచండి.
5 దాసులారా, మీరు క్రీస్తుకు లోబడినట్టు ఈ లోకసంబంధమైన మీ
యజమానులకు గౌరవంతో, యథార్థ హృదయం కలవారై భయంతో
లోబడి ఉండండి.
6 వారి కనుదృష్టి మీమీద ఉన్నప్పుడు వారి దయను పొందాలని
కాకుండా, క్రీస్తు దాసులుగా, దేవుని చిత్తాన్ని హృదయపూర్వకంగా
చేస్తూ వారికి లోబడండి.
7 మనష్యులకు చేసినట్లు కాక, ప్రభువును సేవించినట్లే
హృదయపూర్వకంగా సేవ చేయండి.
8 ఎందుకంటే, దాసులైనా, స్వతంత్రులైనా మీలో ప్రతివారు ఏ
మంచి కార్యాన్ని చేస్తారో దాని ఫలాన్ని ప్రభువు నుండి పొందుతారని
మీకు తెలుసు.
9 అయితే యజమానులారా, మీరు కూడా మీ దాసుల పట్ల
అలాగే ప్రవర్తించండి. ఎందుకంటే మీ ఇద్దరి యజమాని పరలోకంలో
ఉన్నారు, ఆయన పక్షపాతం చూపడని మీకు తెలుసు కాబట్టి వారిని
బెదిరించకండి.

* **6:3** ద్వితీ 5:16 † **6:4** లేదా తల్లిదండ్రులారా

## దేవుని కవచం

10 చివరిగా, ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి ఆయనలో
బలవంతులై ఉండండి.
11 మీరు అపవాది తంత్రాలను ఎదిరించడానికి శక్తిమంతులు
కావడానికి దేవుడిచ్చే సర్వాంగ కవచాన్ని ధరించుకోండి.
12 ఎందుకంటే, మనం పోరాడేది శరీరులతో కాదు, కాని
పాలకులతో, అధికారులతో, ఈ చీకటి లోకపు శక్తులతో
ఆకాశమండలంలో ఉన్న దురాత్మల బలగాలతో వ్యతిరేకంగా
పోరాడుతున్నాము.
13 అందుకే ఆపద రోజున మీరు వారిని ఎదిరించడానికి,
శక్తిమంతులుగా నిలబడడానికి దేవుడిచ్చే సర్వాంగ కవచాన్ని
ధరించుకోండి.
14 స్థిరంగా నిలబడి, మీ నడుములకు సత్యమనే నడికట్టు
కట్టుకుని, నీతి అనే కవచాన్ని ధరించుకొని,
15 పాదాలకు సమాధాన సువార్త వలనైన సిద్ధమనస్సు అనే
చెప్పులు వేసుకుని నిలబడండి.
16 వీటితో పాటు, విశ్వాసమనే డాలు పట్టుకోండి. దీనితో మీరు
దుష్టుని అగ్నిబాణాలన్నిటిని ఆర్పడానికి శక్తిమంతులు అవుతారు.
17 రక్షణ అనే శిరస్త్రాణాన్ని, దేవుని వాక్యమనే ఆత్మ ఖడ్గాన్ని
ధరించుకోండి.
18 ఆత్మలో అన్ని సందర్భాలలో అన్ని రకాల ప్రార్థనలతో
విన్నపాలతో ప్రార్థించండి. దీన్ని మనస్సులో ఉంచుకొని, మెలకువగా
ఉండి పరిశుద్ధులందరి కోసం ఎల్లప్పుడూ ప్రార్థిస్తూనే ఉండండి.
19 సువార్త మర్మాన్ని నేను భయం లేకుండా తెలియజేయడానికి
నేను ఎప్పుడు మాట్లాడినా, నాకు మాటలు అనుగ్రహించబడేలా నా
కోసం కూడా ప్రార్థన చేయండి.
20 దాని కొరకే నేను రాయబారినై సంకెళ్ళలో ఉన్నాను, నేను దాన్ని
ఎలా ప్రకటించాలో అలా దానిని ధైర్యంగా ప్రకటించేలా ప్రార్థించండి.

## చివరి శుభవచనాలు

21 ప్రియ సహోదరుడు, ప్రభువులో నమ్మకమైన సేవకుడు, తుకికు,
నేను ఎలా ఉన్నానో ఏం చేస్తున్నానో మీరు కూడా తెలుసుకోవడానికి
అన్ని విషయాలను మీకు చెప్తాడు.
22 మేము ఎలా ఉన్నామో మీరు తెలుసుకోవాలని అతడు
మిమ్మల్ని ప్రోత్సాహపరచాలనే ఉద్దేశంతో అతన్ని మీ దగ్గరకు
పంపుతున్నాను.

23 సహోదరీ సహోదరులందరికి మన తండ్రియైన దేవుని నుండి
ప్రభువైన యేసు క్రీస్తు నుండి సమాధానం, విశ్వాసంతో కూడిన ప్రేమ
కలుగును గాక.

24 మన ప్రభువైన యేసు క్రీస్తును శాశ్వతమైన ప్రేమతో ప్రేమించే
వారికందరికి కృప కలుగును గాక.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.
You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."
Notice of copyright must appear on the title or copyright page of the work as follows:
Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.
"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.
You must also make your derivative work available under the same license (CC BY-SA).
If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6